చంద్రిక

వెలమవారిలో పాములవంశము చరిత్రచేతను పౌరుషముచేతను సుప్రసిద్ధము. పాములవారసలు వెన్నెలకంటివారు. వెన్నెలకంటి వెంకటరావుగారికి కలిగిన సంతానమంతయు మరణపట్టికలో చేరుచునే వచ్చినది. అతఁడు దేవతలఁ గొలిచినను, బ్రాహ్మణులఁ బూజించినను, రాతికి, అప్పకు మ్రొక్కినను వానియందు భక్తి చిక్కుటయే కాని ఫలము చిక్కలేదు. అతఁడు సోదెలడిగెను, జోస్యము చెప్పించుకొనెను. ఎవరికి తోఁచినటులు వారు చెప్పిపోవుచుండిరి. ఇటులుండఁగా భవిష్యద్వేదియు, సిద్ధుఁడు నగు పాములవాఁ డొకఁ డున్నాఁడని విని, వెంకటరావుగారతి ప్రయత్నమున అతనిఁ దమకడకు రావించుకొనిరి. అతఁడు రావుగారి విన్నపము విని "నీకు పుత్రులు కలుగునటు లాశీర్వదింతును. కాని యీ నియమములు అవలంబింపవలయును. ఒకటి - మీ యింటిపేరు పాములవారని మార్చుకొనవలయును; రెండు - నీ వంశమునఁ గలుగు ప్రతివానిని మా వంశ్యుల కిచ్చి పెండ్లినాఁట మఱల మీ యింటికి తెచ్చుకొనవలయును; మూఁడు - మీ వంశములో ప్రతి పురుగును దాసీ సంబంధము విసర్జింపవలయును. ఈ మూటిలో ఏ నియమమునేని ఏనాఁడు మీరు విసర్జింతురో ఆనాఁటితో మీవంశముసరి" అనెను.

వెంకటరావుగారికి మొదటి రెండు నియమములును సులభములుగానే కానిపించెను. గాని మూఁడవది యే కక్కులకళ్లెము. పెటపెటలమీఁద అతఁ డంగీకరించెను. పాములవాఁ డాశీర్వదించి నిష్క్రమించెను.

ఒకొక్క సంవత్సరమే కడఁచినకొలఁది వెంకటరావుగారి నమ్మకపు నిచ్చెనలో ఒకొక్క మెట్టు ఊడఁజొచ్చెను. తనపట్టణమునుండి వెడలఁగొట్టిన ఒకొక్క దాసికను రావింపఁ బ్రయత్నించెను గాని రాణిగారి భయమువలన అతఁడు దాసికలయెడ బ్రహ్మచారి కావలసివచ్చెను.

పాములవాఁడు వెళ్లి నాలుగేండ్లాయెను. ఆ యేట పాములవాని యాశీర్వాదము 'దీవనలకే బిడ్డలా?' అను సామెతను నిరర్థకము చేసివైచెను. వెంకటరావుగారు తన కుమారునకు 'పాపారావు' అని (ఆ పాముల వాని పేరును పాపయ్యయే) పేరు పెట్టెను.

ఒక పాములవారి కుటుంబమును పిలిపించి తన దివాణము లోనే ఉంచుకొని వారిచేఁ బోషింపఁ జేయుచుండెను. పాపారావుగారి తరువాత మఱియిరువురుకూడ నతనికిఁ గలిగిరి.

ఆనాఁటినుండియు వెన్నెలకంటివారు పాముల వారైరి.

వెలమవారిలో కలువవంశమునకుఁ గూడ విలువ కలదు. తరతరముల నుండియు కలువవారును, పాములవారును బావలు, మామలు, అల్లుఁగుఱ్ఱలు. మఱియు పరాక్రమమునందును పరిభవమునందును సమానులు.

వెలమవారిలో నేఁడు కోడిపందెముల కెంత ప్రాముఖ్యము కలదో నాఁడు గుఱ్ఱపుఁ బందెములకు అంత ప్రాముఖ్యము కలదు.

కలువ రామారావుగారును, పాముల పాపారావుగారి కుమారుఁడు వెంగళరావు గారును పందెమువైచుకొనిరి. వెంగళరావుగారి గుఱ్ఱము వెనుకఁబడెను. అపుడు కలువ రామారావుగారు 'పాములవారికి పాములతోఁ గాక గుఱ్ఱములతోనా పందెము!' అని పరిహసించిరి.

బ్రాహ్మణులకు పరిహాస మిష్టదైవము; వెలమ వారికో – రణదేవత.

వెంటనే వెంగళరావుగారు కత్తి దూసిరి; రామారావుగారును దూసిరి. ఇరువురును ఆ పరిహాసదేవతకు బలియైరి.

నాఁటినుండియు కుక్కకయ్యములు పెట్టుకొని సహజమిత్రులైన ఆ యుభయ వంశ్యులును సహజశత్రులయిపోయిరి.

2

ఎనిమిదితరములు కడఁచినను ఈ రెండువంశములకు పితృపైతామహమగు ఈవైరము ఒక క్షయరోగముగాఁ బరిణమించినది. మఱల నీ యుభయవంశములును పురుషుడు వియ్య మందుటయే దాని కౌషధమని తెలిసికొన్న కులవృద్ధులు వెన్నెలకంటి లేక పాముల విక్రమరావుగారికిని, కలువ వెంకయ్యమ్మారావుగారికిని వివాహము స్థిరపఱిచిరి.

వివాహ మొక నదీసంగమము. ఆ తీర్థమునందు ఉభయవంశములును శాంతిరసమును గ్రోలును.

మైత్రి అనన్యముగానే కలుగవలయు ననియు, మైత్రీదేవతకు తనను లంచ మీయవలదనియు, పాముల విక్రమరావుగారిని వివాహమున అవలోకించుటకంటె తొంటి పెద్దలవలెనే రణరంగముననే అవలోకించుట తనవంశమువారికి పాడియనియు, లేదా,

పాములవారితో ఉదాసీనతగనే ఉండవలయు ననియు వెంకయ్యమ్మారావుగారు వాదించియు, చెప్పించియు వీసరవోయిరి. వివాహబంధనమునుకఁ దలిదండ్రులుగదా అధిదేవతలు! కలువ ధర్మారావుగారు కూఁతుమాటలు కర్ణాకర్ణికగా విక్రమరావుగారికి వినఁబడునేమో యని బెంగతో తగినంత కట్టుదిట్టము చేసెను.

ధర్మారావుగారల్లునకు నొకయేనుఁగును, ఐదుగుఱ్ఱములను, నెనిమిది లొట్టియలను, పదియూళ్లను, ఇరువదిమంది దాసికలను అరణమిచ్చిరి. తన మునిముందు విజయకాహళము, పిదప నౌబతు, తరువాత నేనుఁగులు, వెనుక గుఱ్ఱములు, పిమ్మట సైనికులు, పిఱుఁద భటులు అనంతరమున దాసికలును బెండ్లినడకలు నడుచు చుండఁగా సింహాసనం బమరించిన పల్లకిలో విక్రమరావుగారు వివాహమునకు వెడలిరి.

పెండ్లికొడుకు యుద్ధముచేయని వీరుఁడు; రాజ్యములేని రాజు. అతఁడూరేఁగి దిగ్విజయము చేయును, అతనిమాట రాజశాసనము. అతఁడు చూచెనా–మంగళ గీతము లుదయించును. విశ్రమించెనా – వీచోపులు విస్తరించును.

విక్రమరావుగారసలే రాజుగారు; మఱియు నిపుడు పెండ్లికొడుకు; కాఁగా నతఁ డింద్రుఁడో, ఉపేంద్రుఁడో!

వివాహశాల యంతయు రాజబంధువులచేఁ గొలువుకూటమువలె, లతావృక్షములచే నందనమువలెఁ, బాలచేఁ జైత్రరథమువలె నుండెను. అందు విక్రమరావుగారు ఠీవిగాఁ బ్రవేశించిరి.

లగ్న మాసన్నమాయెను. ఆ వివాహమంటపమునఁదెరలతోఁ గూర్పఁబడిన పటమంటపము బూరటిల్లి వధూప్రవేశము సూచించుచుండెను. పురోహితుఁడు మంత్రపారాయణము చేయుచుండెను. మంగళసూత్రమును గట్ట విక్రమరావుగారు పటమంటపమునఁ బ్రవేశించిరి. సూత్రము గట్టింప నచట చంద్రికయను దాసి నిలువఁ బడియుండెను. దాని యౌవనపరిమళముచే నతఁడు మత్తిల్లెను. అతనిచూపు చంద్రికాముఖమునుండి వధూముఖమునకు మఱలలేదు. తానేమి చేయవలయునో చంద్రికకుఁ దోఁపలేదు. అతనిఁ జూచుచు నది కరఁగి పోయెను. కొంతవడికిఁ జంద్రిక విక్రమరావుగారిచే మంగళసూత్రమును మెలమెల్లగా వెంకయ్యమ్మారావుగారి మెడ గీలింపఁ జేయఁజొచ్చెను. చంద్రికా స్పర్శమున నతని శరీరము గగురుపొడిచెను. విక్రమరావుగా రనుకొనిరి : "ఈ మంగళసూత్రమునకుఁ జంద్రికాకంఠమే సరియగు స్థల" మని విక్రమరావుగారి హస్తస్పర్శమునఁ జంద్రిక యొక్క హస్తము చక్కిలిగిలి పెట్టఁబడినది కాఁబోలు! ఆ మంగళసూత్రము జాఱి క్రిందఁ బడెను. అపుడు విక్రమరావుగారి

నిరీక్షణమాలికయే చంద్రికాకంఠమునఁ గట్టని మంగళసూత్రమాయెను. చంద్రిక తన చూపులచే నతనిపైఁ దలంబ్రాలు వోసెను.

వెంకయ్యమ్మారావుగారా యవినీతి సహింపలేక పోయెను. ఆమె వెంటనే లేచి యా మంగళసూత్రమును జంద్రికాకంఠమునఁ దగిలించి తెరల నన్నిటిఁ దొలఁగించుకొని యంతిపురిలోనికిఁబోయెను. విక్రమరావుగారపుడు నిబ్బరముగా ఆ మంగళసూత్రమును చంద్రికా కంఠమునఁ బంధించిరి. తల్లి మంగయ్యమ్మారావుగారు "ఏమి? యీసాహస" మని యడిగెను. 'అతఁడు దాసికే తగినవాఁడు' అని కూఁతురు ప్రత్యుత్తరించెను.

ఈవార్తచే బంధులోక మంతయుఁ గలగుండు పడెను. తొల్లిటికసి పెరుగుటకే యీ వివాహము సంకల్పితమైనదని బందుగు లనుకొనిరి.

"మమ్మవమానించుటకే యీ వివాహము తలపెట్టితి' రని వెన్నెలకంటివారనిరి. 'మమ్ముల నవమానించుటకే దాసి నాసించి వివాహమునకు విడాకులిచ్చితి'రని కలువవారనిరి. 'దాసిని బట్టుకొనుఁడు; దాసిని బట్టుకొనుఁ'డని కేకలు వినవచ్చినవి. 'వధువును బట్టుకొనుఁ'డని వెన్నెలకంటివారు ఘోషించిరి. ఈ ఘోషణమే యుద్ధారంభమునకు డుబ్బుచ్చి, ఆ సంకులారావమున నుభయ సేనలును దలపడెను. రాజబంధువులు సంకులసమర మారంభించిరి. వివాహమంటపము రణరంగముగా మాఱి పోయెను. వియ్యంకు లిరువురు వీరస్వర్గ మలంకరించిరి.

విక్రమరావుగారు వెంకయ్యమ్మారావుగారిని బట్టుకొన రాణీవాసము చొచ్చిరి. అడ్డుచొచ్చిన యాఁడువారి నెల్లరను కత్తికి బలియిచ్చిరి. తుద కాతఁడు వెంకయ్యమ్మారావు గారిని బట్టుకొని సింహనాదము చేసెను. వెన్నెలకంటివారి వంశమునకు విక్రమరావు గారే మిగిలిరి; కలువవారివంశమునకు వెంకయ్యమ్మారావుగారే శేషించిరి.

3

కారాగారమున వెంకయ్యమ్మారావుగారికిని, రాణీవాసమునఁ జంద్రికకును స్థిరనివాస మేర్పడినది. వెంకయ్యమ్మారావుగారాత్మహత్య చేసికొనఁ బ్రయత్నించుటకైనను వీలులేని కట్టడిలో నుండెను. చంద్రిక యొకతూరి తన బంధుజాలమును జూచుటకేని వీలులేని నిర్బంధములో నుండెను. రాణి దాసియాయెను; దాసి రాణియాయెను.

కర్మ మేతము వంటిది. ఒకతూరి యొక కొమ్ము నేలను ముట్టును; ఇంకొకతూరి ఆకస మంటును. దాసికలచేఁ దనకడకు వెంకయ్యమ్మారావుగారిని రావించుకొని చంద్రిక తనపాదము లొత్తుమని యామె కాజ్ఞాపించును. ఆమె యూరకుండఁగా పలువురు దాసిక లామెచేతులు పట్టుకొని బలాత్కరించి యొత్తింతురు. ఒక జడప్రతిమకుఁ దన

కిచ్చువచ్చినపుడు ప్రాణము పోసి పని చేయించుకొని మరలఁ బ్రాణము తీసివైచి యొక గదిలో దాపఁబడినటులున్న దామె. విక్రమరావుగారు వెంకయ్యమ్మారావుగారి మొగము చూడఁడు. ప్రతిదిన మామెను నిర్బంధించి యెటులెటులు శిక్షించిరో తీరికగా వినును. ఆ శిక్ష కేనాఁడును తృప్తి పొందఁడు.

ఆశ తీఱునుగాని పగ తీఱదు. ఆశ కంతరంగమున్నది; పగకులేదు. పగకొక స్రష్టలేఁడు. అది తనను దానే సృజించుకొనెను. పగయొక్క కుడిచేయి ెంగ; ఎడమచేయి పగ. క్రౌర్యము దానికూఁతురు. దాని కొకకోర కలదు. అది కాటందిి యొకొక్క విషబిందువునే విడుచును. విషగ్రస్తుఁడు కొంచెముసేపుచచ్చి మఱి కొంచెముసేపటికి బ్రదుకును. అది క్రమ్మఱ కాటందుచుండును.

'తామెంత హింసించినను వెంకయ్యమ్మారావుగారు పల్లెత్తు మాటయేని పలుక'దని దాసికలు చెప్పినపుడు విక్రమరావుగారు పండ్లుపటపటకొఱికికొనును. అపకారిని క్షమించుటయే కసి తీర్చుకొనుట కదా!

వెంకయ్యమ్మారావుగారిపై పగతీర్చు కొనుటకే విక్రమరావుగా రంతగాఢముగా చంద్రికను బ్రేమింపలేదు. ఆఁకలి యెటులు కలిగెనో చంద్రికపై ప్రేమయు నటులే కలిగెను. ఈ ఘటన యుదాసీనమే.

అతఁడు చంద్రికను ప్రేమించినాఁ డనుటకంటె అతఁడు చంద్రికకంటె వేఱేమియు నెఱుఁగఁ డనుట యుక్తతరము. అతని ప్రేమ చంద్రిక నెంత ప్రేమించినను ఆవల మిగిలియే యుండును. ఆ మిగిలిన ప్రేమ ప్రపంచకమున నాతఁ డానందించును; పక్షివలె ఎగురును. యతని ప్రేమయును జలప్రళయమున రాజ్యమును, ప్రపంచమును, తుదకు తానును గూడ మునిఁగిపోయిరి. అందు చంద్రికయను లంక యొక్కటియే తేలాడుచుండెను.

చంద్రిక విక్రమరావుగారి యింగితదేవత. అది యతని దాసిగా మాఱును; శిష్యగా నగును; గురువుగా పరిణమించును; శయ్య యయిపోవును. అది యతని యభీష్టదేవత.

చంద్రిక యేడ్చి యతని నేడిపించును; నవ్వినవ్వించును; త్రాగి త్రాగించును; సొక్కి సొక్కించును; ఏడ్వకయు నేడిపించును; నవ్వకయు నవ్వించును; త్రావకయుఁ ద్రావించును; సొక్కకయు సొక్కించును. విక్రమరావుగారు చంద్రిక చేతిలో కీలుబొమ్మ.

ప్రేమయను పాలవెల్లిలో ఇంద్రియసుఖ మొక విషద్వీపము. ఆ విషద్వీప మెక్కిన వెంటనే క్షీరసముద్ర మంతయు విషసముద్ర మయిపోవును.

విక్రమరావుగారు ఎంతవ్యయ మొనరించినను మిగులునిధివలె నున్న ప్రేమ పరిశిష్టముయొక్క ఛాయ. అట్టిఛాయయే చంద్రికాసహస్రమును సృష్టింపఁగలదు.

చంద్రిక రాజు : విక్రమరావుగారు రాణి. రాజ్యమున నిసుమంతయుఁ గొఱలేదు. ధర్మము నాలుగుపాదముల నడిచిపోవుచున్నది. ప్రజలో – చంద్రికకు జయవెట్టని చేతులు లేవు.

వెంకయ్యమ్మారావుగారి మాట యిపుడెవ్వరు నెఱుఁగనే యెఱుఁగరు. తానేమో; తన కారాగారమేమో! అది శరత్కాలచంద్రికయే యగుఁగాక! నిదురలో దాని నెవ రెఱుఁగుదురు?

4

కలహంసియనిన నితరదాసికల కందఱకు కడుపుమంట. అది చంద్రికకుఁ గడునిష్టురాలు. కలహంసివచ్చుచో దాసికలంద ఱుషాగమమందలి యంధతమసము వలె విఱిసిపోవలసినదే. దాని నందఱు నిందింతురు కాని యది ఎవరిని పల్లెత్తుమాట అనదు.

కలహంసి కంతఃపురముననే యొక యంతఃపురము కలదు. అది యచట నెటులు సంచరించుచుండునో, చంద్రిక కడ కెపుడువచ్చునో, యెపు డేఁగునో యితరుల కెవరికిని దెలియదు. కలహంసి యొకదాసియనియు, చంద్రిక కంతరంగసఖి యనియు, విక్రమరావుగారు చంద్రికకడకు రాఁగనే కాకులవలె నెగిరిపోయినటులు అదిరాఁగనే యావలికి వెళ్లిపోవలయు ననియు దాసీలోక మెఱుఁగును.

కలహంసి చంద్రిక కెంత యిష్టురాలో విక్రమ రావుగారికిఁగూడ నంత యిష్టురాలు. కలహంసి విక్రమరావుగారికి మద్యపాత్రముతోఁ దక్క నూరక కానరాదు. దానిచేతులతోఁ దక్క మఱిదేని చేతులతోను విక్రమరావుగారికి మద్యము సయింపదు. విక్రమరావుగారి దప్పి యార్పక కలహంసి చంద్రికకడ కేఁగదు. అతఁడు నిదిరించినంతట కలహంసి లోని కేఁగి యాయంతఃపురకవాటములు దృఢముగా బంధించుకొనును.

రాజుతో అతిపరిచితికల దాసి రెండవ రాణి. దానిమాట మొదట; రాణిమాట పిదప.

5

శరచ్చంద్రికలో చంద్రికయు, విక్రమరావుగారును విహరించుచుండఁగా నచటికి దాది శిశువును దీసి కొనివచ్చెను. చంద్రికచేతులలో నాబాలుఁడు బాలచంద్రునివలె నుండెను. చంద్రిక ఆ బాలు మోము చూచి విక్రమరావుగారితో సరిగా 'మీ మోమే!' అనియెను.

'అది స్తుతి నీ మోముకాదు. నా మోమునుకాదు. ఇరువురిమోము' అనుచు తల్లిమోమునకానించి విక్రమరావుగారిరువురమోముల ముద్దాడిరి.

చంద్రిక శిశువును విక్రమరావుగారి కిచ్చెను. అతఁడా శిశువు నేకాగ్రతతో తిలకించు చుండెను.

ఏకాగ్రత యొక యద్దము. అందు కొన్ని విషయములు స్ఫుటమగును, మఱికొన్ని అస్ఫుటముగను కానిపించును.

"చంద్రికా! నీవు నాతో కారాగారమునకు రావలయును."

"నాకు అలంకారవేళ యయినది."

దాది వెంటరా శిశువు నెత్తికొని విక్రమరావుగారు కారాగారమున కేఁగిరి. గొలుసులచే కాలుసేతులు బంధింపఁబడి కూలఁబడియుండిన వెంకయ్యమ్మారావు గారు అతనిఁజూచి చిఱుతపులివలె లేచి నిలువఁబడెను.

"అంతటి యవినయము చేయకుండినచో ఈపాటికి నీవును నాచేత నింతశిశువు నెత్తించి యుందువు."

వెంకయ్యమ్మారావుగారు సహజ మౌనము మానలేదు.

"ఇదిగో మీమూగ అమ్మకడకు వెళ్ళుము!" అని శిశువును విక్రమరావుగారు దాది కిచ్చిరి.

"నాకొక కోరికకలదు. చాలఁగాలము నుండి తమతో మనవిచేసి కొన నువ్విళ్లూరు చుంటిని. చెప్పుమని సెలవా?"

"అదియేమి?"

నన్నిచట బంధించి యుంచుట పిఱికి తనము నాచేతి కొక కత్తియిందు; తా మొక కత్తి కొందు. అది వెలమపని. ఇది దాసీకృత్యము కాదా?"

"నిన్ను నరకమున గొంతువఱకు పాఁతి పెట్టించెదను; ప్రేలకుము."

"ఓరీ! ఇంతకంటె అదిమేలు; అటులు చేయింపుమురా!"

విక్రమరావుగారి కనుసన్నలచే నిరువురు దాసిక లిరువైపులనుండి కొరడాలతో నామెను బాఁదిరి. ఆమె యిసుమంతయు చలింపలేదు.

"ఓసీ, యీనాకుమారు నెత్తికొనుము!"

"ఓరీ! వాఁడెవఁడో నీ వే మెఱుఁగుదువు?"

"నీ నాలుక కోయించెదను."

"ఇంకొక యేడుదాఁటిన పిదప వీనితో నామోము చూదరమ్ము; మఱచితిని. అపుడు నీ నాలుకను కోసికొని మఱిరమ్ము."

విక్రమరావు గుండెలలోరాయిపడెను. వృథా లోచన మపుడు పనులలో మునిఁగి తేలుచుండెను. అతఁడచటినుండి లేచిపోయెను. అచటి దాసికలను దాదిని రాజ్యాంతరము వెళ్లఁగొట్టెను. శిశువును లోనికిఁ బంపి వైచెను.

"నేనిపుడు చంద్రికనుదక్క నెవరి నెఱుఁగుదును? ఎవరినడుగను? ఏమని యడుగను? ఎటులు కనిపట్టుదును? మద్యము క్రోల కెటు లుందును? చీచీచీ! కలహంసీ, కల్లు కల్లు! మద్యము మద్యము!! రమ్ము రమ్ము!!!"

కలహంసి మద్యము తెచ్చెను. విక్రమరావుగారు మద్యముపైఁ దమ విక్రమమంతయు వినియోగించిరి. కలహంసి వెళ్లిపోయెను. అంతఃపుర కవాటములు కటకట పడుచున్నటులు కటకట పడెను.

"కలహంసీ, మద్యము; కలహంసీ, మద్యము; కల మద్య-క-మ" అని దీర్ఘధ్వనులా కవాటమునకుఁదాఁకెను. అంతఃపురమున జాగరూకయయియున్న చంద్రిక "కలహంసీ! మఱల మద్యముగొని పొమ్ము" అని శాసింపఁగా కలహంసి క్రమ్మఱ మద్యపాత్రము పూరించి విక్రమరావుగారికడ కేఁగెను.

విక్రమరావుగారు వదరుచుండిరి. కలహంసి మద్యపాత్ర మతని కందిచ్చెను. అతఁడు దానిని ద్రావుచు "ఎ ఎ ఎవరికు కుకు కుమారుఁ"డనెను. ఉదరములోని కేఁగఁగా మిగిలిన మద్యమాతని వక్షమును శిరమును అభిషేకించెను. విక్రమరావుగారు సుఖస్వర్గ మధిరోహించుచుండిరి. అతనిగ్రుడ్లు చంద్రనిప్పులవలె నెఱ్ఱబాఱినవి; అధరము వెల్ల బాఱినది. అతఁడు నేలఁగూలి, స్వర్గమెక్కి యింద్రత్వ మనుభవించుచుండెను.

కలహంసి యంతిపురిలోని కేఁగి తలుపులుమూసి కొనెను. అవి తెల్లావారుదనుక విడివడలేదు. అంతవఱకు విక్రమరావుగారును ఇంద్రత్వమును వీడలేదు.

6

ఇపుడు వెంకయ్యమ్మారావుగారికి వెనుకటియంత హింసలు లేవు. ఇపుడు విక్రమరావుగారి కామెమోముఁజూడ సిగ్గు. నాఁడును నేఁడును వెంకయ్యమ్మారావుగా రొకరీతిగనే యుండిరి. అమాయికతయొక్క తావియు సొగసుఁదనమును ఆమెను త్యజింపలేదు.

వాన కురియుచుండెను. విక్రమరావుగారు మేడపై నాలోచించుచుఁ గూరుచుండిరి. ఆ యత్యంత ప్రశాంతసమయమున నతని విషాదాయుర్ని మేషముల లెక్కిడుచున్నటులు ఒకొక్క బిందువే పడుచుండెను. తన మోహపరిమళము సహింపలేక గాలికిఁ గొట్టుకొని పోవలె ననుకొన్నటు లాతఁడు గవాక్షముఁ దెఱచెను. అతఁ డాయుదకధారలందు

చంద్రికాకంఠమున మంగళసూత్రము నెందుబంధించెనో యాపట మంటపమును గాంచెను.

"ఛీ, చంద్రిక యేమి? అనుమానమేమి? చంద్రికా, చంద్రికా" యని మెల్లగా ననుకొనుచు అంతఃపురమార్గము పట్టెను.

శిశువు నెత్తికొని దాది దాపునకువచ్చి "బాబుగారికి మాటలన్నియు వచ్చినవి; ఎక్కడలేని యూహలును పుట్టిన" వని మనవిచేసెను.

విక్రమరావుగా రాశిశువునెత్తికొని యుపలాలింపఁ దొడఁగిరి.

ఉపలాలన మొక మచ్చుమందు. దానిచే నీశ్వరునైనను సేవకుని జేయవచ్చును.

ఆ శిశువు కుక్కపిల్లకంటెఁ జనవుగా విక్రమరావుగారికడ కరుగును. విశ్వాసముతో విక్రమరావుగారతని నెత్తికొందురు. అతఁ డాశిశువు విజయునిపై నేకాంతమున అతిప్రేమ నభినయించు చుండెను.

విజయుఁడు తనకడకు వచ్చినపుడెల్ల విక్రమరావుగారి మనోగృహపుఁ జట్టము ఉద్ఘాత లూఁగిపోవుచుండెను. నోటివఱకు వచ్చిన కొన్ని మాటల నాతఁడు మఱల స్తంభింపఁ జేసికొనుచుండెను.

నాఁడు విజయుని జన్మదినోత్సవము. దాది యతని నలంకరించి విక్రమరావుగారి కడకుఁ దీసికొని వచ్చెను. విజయుఁ డానూతనాలంకారములను జూచుకొనుచుండెను.

"బాబూ! అయ్యగారికాడి కెళ్లు!"

"ఛీ ఛీ, నీకు తెలదుపో" అని ఆ విజయుఁడు దాది నీసడించి తన విజ్ఞానమునకు గర్వపడెను. దాది తెల్లబోయెను. విక్రమరావుగారిలో నొక జిజ్ఞాసలేచి కూరుచుండెను.

"దాదీ! నీ వేఁగి యిరువురుసేవకులఁ బంపు" మని విక్రమరావుగారు విజయు నెత్తుకొని తలుపులు మూసి "విజయా! అయ్యగా రెవరు?" అని యడిగిరి.

"మా అమ్మదగ్గిరుంటుందే – కలంసి – అదీమా అయ్యారు."

విక్రమరావుగారు కూలఁబడి "అయ్యో! అవ్యక్తత" అని తల బాఁదుకొనిరి. అపుడే కోటముందు వృద్ధగజముపై పిడుగుపడెను.

"నిజమంటే నిజం. కలంసి నన్ను అయ్యారూ అని పిలమని చాటుగా చెబుతుంది."

"ఏమది?" అనుచు విక్రమరావుగా రేకాగ్రతతో నాలోచించుచుండిరి. తనను దహించి భస్మసాత్కరించు చరమాగ్నియొక్క రూపమును విక్రమరావుగారి ముఖము గుంజుకొనుచుండెను.

"తలుపు! తలుపు!"

అతఁడు మంచుగడ్డవలెఁ జల్లఁబడి, విజయు నెత్తుకొని తలుపులు తెఱచెను. చంద్రిక లోపలఁ బ్రవేశించుచుఁ జేతులు చాఁపెను.

చంద్రిక వెనుకనే కలహంసి మద్యపాత్రముతోఁ బ్రవేశించి తలుపుచాటున నుండెను.

"కలహంసీ! లోనికి రమ్ము! ఏదీమద్యము?" అని విక్రమరావుగా రడిగిరి. కలహంసి యతనికి మద్యపాత్ర మిచ్చెను. అతఁడు విజయు నొకమాఱును, కలహంసినొక మాఱును సమయము చిక్కినపు డెల్ల చూచుచు "దేవీ! ఇతనిని దీసికొ"మ్మని విజయుని చంద్రిక కిచ్చి "కలహంసిని నేఁడు నాకడ నుంపవలెను. ఈ కుర్రని జన్మదినోత్సవమున నా కెడతెగకుండ మద్యము కావలసియుండును. నీవుమాత్ర మెఱుఁగవా?" అనెను.

చంద్రిక కలహంసికేసి చూచి నవ్వుచు "ఇంత కంటెనా?" అనియెను.

"చంద్రికా! నీవు నేఁడు చక్కగా నలకరించుకొనియుండుము. నేనును వెంటనే నీకడకు రాఁగలను."

"తప్పక రావలయును!" అనుచు చంద్రిక శిశువు నెత్తికొని వెళ్లిపోయెను. విక్రమరావుగా రదేపనిగా ద్వారముదెస చూచుచుండిరి. కొంతవడికి ఇరువురు సేవకులు వచ్చి ద్వారముకడ నిలువఁబడిరి.

కలహంసి విక్రమరావుగారికి మద్య మీయఁబోయెను.

"ఓసీ! నాకు ముందు కొంచెము పాలుతెమ్ము!"

కలహంసి లోనికేఁగి పాలుతెచ్చెను. విక్రమరావుగారు ఆ పాలగిన్నె నచటఁ బెట్టికొనిరి.

అతఁ డపుడు మరణమంత యత్యంతాభావ మనుభవించుచుఁ బటకుటీరమున నుదయించిన యౌవన మత్తతకు గోరీకట్టి దానిపైఁ దా నిలువఁబడియున్నటు లూహించు కొనుచుండెను.

కలహంసి కొంతసేపటికి "దేవా! మద్యము!" అనెను.

"ఓసీ! నాకు మద్యము కాదు; రక్తము కావలయును."

"దేవా! అది యేమి?"

"ఇదిగోఁ గత్తి! ఈ మద్యమున నీరక్తము కలిపి నీ కుమారుని జన్మదినోత్సవమునఁ గ్రోలుదును."

కలహంసి తాను తానో, లేక మృత్యువు ప్రసాదించిన యొక యభావమో తెలిసికొనఁ జాలకుండెను.

విక్రమసింహుఁడు సేవకుల లోనికిఁ బిల్చి "ఈ కలహంసి నాగదిలోనికిఁ గొంపోయి వస్త్రము లూడ్చి తీసికొనిరం" డని ఆజ్ఞాపించిరి.

వెంటనే సేవకులు దానిని గదిలోనికిఁ గొంపోయిరి.

విక్రమరావుగా రొకతూరి కత్తిజళిపించిరి. అది మృత్యువు జిహ్వా చాఁపినటులుండెను.

ఒక గోఁచితో కలహంసుఁడు గదిలోనుండి కొని రాఁబడియెను.

"ఓరీ! నీకు ధైర్యమున్నచో ఈకత్తిగొని నన్నునఱకుము!"

కలహంసుఁడు వెలవెలఁబోయెను.

"ఓరీ! నీపేరేమి?"

"కలహంసుఁడు."

7

సేవకుఁడొకఁడు కారాగార ద్వారములు తెఱచి వెంకయ్యమ్మారావుగారిని విడిచిపుచ్చెను.

మఱియొక సేవకుఁడు చంద్రికకడకు వచ్చి "దేవీ! నేఁటి విజయుని జన్మదినోత్సవమున భూతభవిష్య ద్వర్తమానములు చెప్పఁగలిగిన పాములవాఁ డొకఁడు మిమ్ములవినోదింపఁజేయ దేవరయానతిచే నిపుడే రాఁగ లఁ"డని నివేదించెను.

వెంటనే పాములబుట్ట చేకొని యొక పాములవాఁడు చంద్రికాంతఃపురము ప్రవేశించెను. వాని తలపాగ పలురంగుల పాములతోళ్లచే చేయఁబడి నటులుండెను. అతని నాగసొరబుఱ్ఱ చుట్టులు చుట్టుకొని లేచియాడుచు పాడుచునున్న పామా యనిపించుచుండెను.

సర్పాధిదేవతగా నున్నాడాతఁడు. వాఁ డా పాములబుట్ట క్రిందనిడి నాగసొరము పాడఁదొడఁగెను. వాని బుగ్గలు తిత్తులవలె ఉబుకుచుండెను. అతని మోమునందలి నామము మృత్యుశిరమున నెత్తిన దీపశిఖవలెనుండెను. విజయుఁ డాపాములవాని కడ కతి చనవుగా నేఁగెను. అతి సమ్మోహనముగా నున్న దాస్వరము.

చంద్రిక "కలహంసీ రమ్ము ర"మ్మని పిలిచెను. పాములవాఁ డా సొరబుఱ్ఱ క్రిందనిడి "నేను వట్టిపాములవాఁడనే కాను. నేను కాలజ్ఞుఁడను."

"మా కలహంసిని రానిమ్ము చెప్పుదువుగాని.

కలహంసి యని యేల మోసగించెదవు? కలహంసుఁడని సత్యము చెప్పుము!"

"మెల్లఁగా నసుము. మెల్లఁగా మాటలాడుము!"

"నాకడ నొకశక్తియున్నది. దానిచే నా మాటలు గోడ యావలనుండు వారికి వినరావు."

జోస్యము కౌతుక కవాటములు తెఱచును. అందు శ్రోత కెదురుగా ఆశీర్వదించుచు నొక దేవత ఫలసమృద్ధమయిన పళ్లెరమ్మొండు కైకొని నిలిచియుండును. అందలి ప్రతిపండును శ్రోతవడిలో పడుచుచుండును.

"నీకట్టి శక్తి యుండుఁగాక! నాకు భయమగుచున్నది."

"దేవీ! భయపడకుము; నన్ను నమ్ము. నీకు ముందు పెద్దయదృష్టము గలదు. నీవు కావలసిన ప్రశ్న లన్నియు నడుగుము. నీకు సంతృప్తియగు పిదపనే నాకు బహుమతి యిత్తువుగాక!

"కలహంసుఁడెపుడేని పట్టుఁబడునా?"

"ఇఁకఁ బట్టుపడఁడు.

"రాజు విజయుని అనుమానింపఁడుకదా!"

"అతని కిపు డేమియు ననుమానము లేదు."

"చెఱలో ఒకరాణి యున్నది. దానికి విమోచనము కలుగునా?"

"ఇఁక క్రొత్తగా కలుగదు."

చంద్రిక ఆలోచించుచుండెను. పాములవాఁడు" దేవీ! నీకు ప్రశ్నము లేమియు గోచరించుచున్నటులు కానరాదు. కొన్ని నేనడిగెదను. వానివలన నీకుఁ దోఁపవచ్చును" అనెను.

"ఔను."

"నీకు రాజ్యకాంక్ష కలదా?"

"సంపూర్ణముగా."

"నీ కొకగంటలో అది పూర్తియగును. అయితే రాజుగారు పరిష్కారము కావలయునని తమకు కోరిక యున్నదా?"

"అది సిద్ధించు టెటులు?"

"ఎంత తెలివిమాలిన యాఁడుదానవు? ఆఁడుదానిలో ఈ తెలివితక్కువ నే నెచటను జూడలేదు. సరియ. నీ యభీష్టము నేను నెఱవేర్చెదను. ఇంకొకమాట – కలహంసుఁడు నీ కెట్టి చుట్టము?"

"రాజుగారికంటె ముందు తాళిగట్టినమగఁడు".

"రాజు నాతనిచే చంపింపఁగోర్కియా?"

"వేయేండ్లు వర్ధిల్లుము!"

అచటనచట నాడుకొనుచు నపు డచటికి వచ్చిన విజయుఁడు "అమ్మా! ఈ మాట ఆయనతో చెబుతా. ఆయన్ని చంపాలని చూస్తున్నావుగా. నన్ను చంపి మఱీ ఆయన్ని చంపు" అనెను.

"దేవీ! నీకోరిక సిద్ధించితీఱును గాని అతనిచే సిద్ధింపదు."

"మఱీ యెవనిచేత?"

"నాచే."

"నిక్కముగా?"

"నిక్కముగా."

"నాకొక బహుమతి కావలయును."

"నీ యిష్టము, కోరుకొనుము."

"తిరిగి పోరాదు."

"తిరిగి పోవను. ముమ్మాటికి తిరిగిపోవను."

"చెప్పనా?"

"వడిగా."

"హత్యయొనరించు ఈపాములవానిని బ్రదికియున్నంతవఱకు మఱచి పోవలయును."

ఇదేమి బహుమానము?"

"ఇది బహుమతియే కానియెడల ఒక –"

"ఒక యేమి?"

"ఒక – "

"ఛీ, నీ వనుమాన పిశాచగ్రస్తుఁడవు! చెప్పుము. ఒకయేమి? ఊరా? పరగణా?"

"ఇస్సీ! ఎంతనైచ్యము!"

"ఏమా గొప్ప ఒక?"

"తిరిగి పోరాదు."

"చీ చీ, ఎంత నీచుఁడవు? నీ యెడలనే నీకు నమ్మకము లేదు."

"ఔను. నేను నీచుఁడనే. ఒక ముద్దడుగఁ దలఁచితిని. కాని యిపుడుకాదు. అతనిని చంపిన తరువాత."

చంద్రిక యొక చిఱునవ్వు నవ్వెను. ఆ నవ్వుతో పాములవాఁ డా పాదమస్తకము కదలిపోయి యిటులనెను :

"ఇఁక నతనిచంపుదునా?"

"ఊ! ఊ."

"మా నాన్న నే చంపేస్తారా? నేను పోయి చెప్పేస్తాను" అనుచు విజయుఁడు పరువెత్తఁ దొడఁగెను. చంద్రిక వానిఁబట్టుకొని ముఖపిధానము చేసెను.

"ఏల నోరు మూసెదవు? అతనికి వినఁబడినను నీకు భీతిలేదు." "నాయనా! ఈపాలు తాగెదవా?" అని యొకపాలగిన్నెతీసి ఆపాములవాఁడు విజయునికిచ్చెను. విజయుఁడాగిన్నెను క్రిందఁబాఱవైచి "నాన్నా! నాన్నా!" అని యేడ్వఁ దొడఁగెను.

పాములవాఁడు తల విసిరి పాగను క్రిందఁబడునటు లొనరించెను. చిరపరిచిత మగునొక పరిమళ మాకేశకలాపమునుండి చంద్రిక కడకుఁ బ్రసరించెను.

చంద్రిక కన్ను చెదరెను; నోరు పడెను; ముఖము వెలిసిపోయెను.

విజయుడు "నాన్నా నాన్నా" అని పిలిచెను. పాములవాఁడా బుట్టమూఁత తీసి యందలి నల్లత్రాచు నెడమచేతితోఁ బట్టుకొని కుడిచేతిమీఁదను, కుడిచేతితోఁ బట్టుకొని యెడమ చేతిమీఁదను కఱిపించుకొనెను. మరణము కోరుకొనఁగా ప్రాణము లీయఁ బడినటులు చంద్రిక తలఁచెను.

"నాన్నా! నాకా పా మియ్యవూ? నేనూ నీకు మల్లే ఆడుకుంతాను" అని విజయుఁ డనెను.

పాములవాఁడు "నాయనా! ఇదిగో! ఇచ్చెదను పట్టుకొనుము!" అని అతనికేసి చూపుచు నలిపి నలిపి గవాక్షమునుండి నేలమీఁదికి విసిరివైచి నేలఁగూలెను.

విజయుఁ డతనిని వెఱ్ఱిగా చూచుచు "నాన్నా, నాన్నా! అమ్మా! వదిలెట్టవే" అని పలవించెను.

అపుడు వెంకయ్యమ్మారావుగారు రెండు ఖడ్గములు చేఁబూని యచటికివచ్చి బొమ్మవలె నిలిచిపోయెను. పాములవానివలెనే ఆ ఖడ్గములు రెండును నేలఁగూలెను.

● *భారతి - జనవరి - 1927* ●